


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com


4PM

www.suryaa.com

సోమవారం

16-06-2025

పేజీలు: 02



## 101 మందికి పాజిటివ్.. 11 మంది మృతి

దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. నిన్న కేసుల పెరుగుదలలో స్వల్ప తగ్గుదల కనిపించింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం.. 24 గంటల్లో 101 మందికి పాజిటివ్‌గా తేలింది. నిన్న ఒక్కరోజే 11 మంది మరణించారు. అత్యధికంగా కేరళ రాష్ట్రంలో 1,920 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్‌లో 1,433, పశ్చిమ బెంగాల్‌లో 747, ఢిల్లీలో 649, కర్ణాటకలో 591, మహారాష్ట్రలో 540, ఉత్తరప్రదేశ్‌లో 275, రాజస్థాన్‌లో 222, తమిళనాడులో 220 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. దీంతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 7,264కి పెరిగింది. నిన్న కేరళలో ఏడుగురు, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 11 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ కరోనాతో మరణించిన వారి సంఖ్య 108కి పెరిగింది.

# 36 దేశాలపై ట్రావెల్ బ్యాన్?



పన్నెండు దేశాల పర్యాటకులను అమెరికాకు రాకుండా నిషేధం విధించిన ట్రంప్ ప్రభుత్వం.. దీన్ని మరిన్ని దేశాలకు విస్తరించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు యూఎస్ విదేశాంగ శాఖ అంతర్గత నివేదికను ఊటంకిస్తూ అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దేశ భద్రత దృష్ట్యా పర్యాటకులపై నిషేధాన్ని మరిన్ని దేశాలకు విస్తరించాలని ట్రంప్ భావిస్తున్నారు.విదేశాంగ శాఖ రూపొందించిన నివేదికలో అమెరికా ప్రభుత్వ ఆందోళన గురించి చర్చించారు. కొన్ని దేశాల్లో పౌరుల గుర్తింపునకు సంబంధించిన లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 36 దేశాలపై పాక్షిక, లేదా పూర్తిస్థాయి ట్రావెల్ బ్యాన్ విధించాలని విదేశాంగ శాఖ సూచించింది. పాస్‌పోర్టు భద్రతలో లోపాలు, వీసా గడువుకు మించి అమెరికాలో ఉంటున్న జనాలు, డిపోర్టేషన్‌కు కొన్ని దేశాలు సహకరించకపోవడం, ఉగ్రవాద కార్యకలాపాలు, యూదువ్యతిరేక కార్యక్రమాల్లో విదేశీయులు పాలుపంచుకోవడం తదితర సమస్యలను విదేశాంగ శాఖ పేర్కొంది. ఒక్కో దేశంలో ఒక్కో సమస్య ఉన్నదని తెలిపింది. ఈ నేపథ్యంలో అమెరికా చేసిన సూచనలను 60 రోజుల్లో అమలు పరచని పక్షంలో ఆయా దేశాలపై నిషేధం అమలు చేయాలని నిర్ణయించింది. అంగోలా, ఆంటిగ్వా అండ్ బార్బుడా, బెనిన్, భూటాన్, బుర్కినా ఫాసో, కాబో వర్డే, కంబోడియా, కామెరూన్, కోట్ డి'వోయర్, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, జిబూటీ, డొమినికా, ఈథియోపియా, ఈజిప్ట్, గ్యాబోన్, ద గాంబియా, ఘానా, కిర్గిజిస్తాన్, లైబీరియా, మాలావి, మౌరిటా నియా, నైజర్, నైజీరియా, సెంట్ కిట్స్ అండ్ నేవిస్, సెంట్ లూసియా, సావ్ టోమే అండ్ ప్రిన్సిపే, సెనెగల్, దక్షిణ సూడాన్, సిరియా, టాంజానియా, టోంగా, టువాలు, ఉగాండా, వనాటు, జాంబియా, జింబాబ్వే దేశాలకు ట్రావెల్ బ్యాన్ వర్తింప చేసే అవకాశం ఉంది.

# రెండు విడతల్లో కుల-జనగణన

15 ఏళ్ల తర్వాత దేశంలో జన గణన జరగనుంది. దీనికి సంబంధించింది కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. 1948 జనాభా లెక్కల చట్టం (1948లో 37)లోని సెక్షన్ 3 ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ జనగణన చేపట్టాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో రెండు విడుతల్లో జన గణన జరగనుంది. 2026 అక్టోబర్ 1 నాటికి జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్, లడఖ్ లో జన గణన ప్రక్రియ ముగియనుంది. మిగతా రాష్ట్రాల్లో 2027 మార్చి 1 నాటికి జన గణన పూర్తి కానుంది. జనగణనతో పాటే కులగణన సైతం కేంద్రం నిర్వహించనుంది..జన గణన ఏవిధంగా జరపాలని అన్న దానిపై ఉన్నతాధికారులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే సమీక్ష జరిపారు. జనగణన కోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పనిచేయనున్నారు. డిజిటల్ రూపంలోనే ట్యాబ్ ల ద్వారా జనాభా లెక్కల సేకరణ కొనసాగనుంది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యాప్లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదుచేసే వెసులుబాటు ఉండనుంది.. జన, కుల గణనలో డేటా భద్రత కోసం కేంద్ర హోంశాఖ కఠినమైన చర్యలు తీసుకుంది.. సమాచారం సేకరణ, బదిలీ, స్టోరేజీని కోసం అత్యంత కట్టుదిట్టంగా భద్రతా చర్యలను తీసుకోనుంది హోంశాఖ.. ప్రస్తుతం అధికారిక లెక్కల ప్రకారం.. భారత జనాభా 140 కోట్లు.. చైనా తరువాత అత్యంత అధిక జనాభా కలిగిన దేశంగా భారత్ ఉంది. 2011 లో చివరిసారి జన గణన జరిగింది. కోవిడ్ కారణం వల్ల 2021 లో జరగాల్సిన జన గణన వాయిదా పడింది. స్వతంత్ర భారత చరిత్రలో కుల ఆధారిత జన గణన జరగడం ఇదే తొలిసారి. ఈసారి జరిగే జన గణన వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లలో మార్పులు, మహిళా రిజర్వేషన్లు, డిలిమిటేషన్ నియోజవర్గాల పునర్విభజనకు ప్రామాణికంగా ఉండనుంది.ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేపట్టి రిజర్వేషన్లలో మార్పులు తీసుకువచ్చింది. మరి కేంద్రం చేసే జన కుల గణన దేశంలో ఎటువంటి మార్పులు తీసుకువస్తుందో వేచి చూడాలి.



# రామాయణ్‌లో రకుల్

బాలీవుడ్ డైరెక్టర్ నితీష్ తివారీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'రామాయణం' ఈ సినిమాకి సంబంధించి రోజుకో వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కోడుతుంది. ముఖ్యమైన పాత్ర కోసం మేకర్స్ గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రాను సంప్రదించారని తాజాగా ప్రచారం సాగుతోంది..! రామాయణంలో శూర్పణఖది కీలక పాత్ర. ఈ పాత్ర కోసం మేకర్స్ తొలుత ప్రియాంక చోప్రాను తీసుకునేందుకు ఆసక్తి చూపించారని తెలిసింది. కానీ హాలీవుడ్ ప్రాజెక్ట్ షెడ్యూల్స్‌తో ప్రియాంక బిజీగా ఉండడం వల్ల ఈ సినిమా చేసేందుకు వీలు కాలేదట. దీంతో ఈ క్యారెక్టర్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్‌కు వెళ్లినట్లు సమాచారం. దీనికి రకుల్ కూడా ఓకే చెప్పారని ఇండస్ట్రీ టాక్. ఈ పాత్రకు ఆమె సరిగ్గా సెట్ అవుతారని మేకర్స్ భావిస్తున్నారట. సినిమా విషయానికి వస్తే, ఇందులో పలు ఇండస్ట్రీలకు చెందిన అగ్ర నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, కన్నడ స్టార్ యష్ రావణుడి పాత్ర పోషిస్తున్నారు. వీరితోపాటు మోహిత్ రైనా శివుడిగా, సన్నీ దేఓల్ |హనుమంతుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా, అరుణ్ గోవిల్ రాజు దశరథుడిగా కనిపించనున్నారు.



# అదిరిపోయిన రాజా సాబ్ టీజర్


రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న రాజా సాబ్ సినిమా కోసం రెబల్ ఫ్యాన్స్ అంతా ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. సలార్, కల్కి సినిమాలతో భారీ హిట్స్ అందుకున్న ప్రభాస్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సలార్ సినిమా రూ. 700కోట్లకు పైగా వసూల్ చేసింది.. అలాగే కల్కి సినిమా రూ. 1000కోట్లకు పైగా వసూల్ చేసి నయా రికార్డ్ క్రియేట్ చేసింది. ఇక ఇప్పుడు మారుతి దర్శకత్వంలో రాజా సాబ్ గా రానున్నాడు ప్రభాస్. ఇప్పటికే రాజా సాబ్ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలో ప్రభాస్ డ్యూయల్ రోల్ లో కనిపించనున్నాడు. అలాగే ఈసినిమాలో ప్రభాస్ కు జోడీగా ముగ్గురు అందాల భామలు నటించనున్నారు. రాజా సాబ్ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధి కుమార్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. తాజాగా రాజా సాబ్ సినిమా నుంచి టీజర్ ను విడుదల చేశారు. బాబోయ్ రాజా సాబ్ టీజర్ అదిరిపోయింది. ప్రభాస్ లుక్స్ మాములుగా లేవు.. ఫ్యాన్స్ ప్రభాస్ ను ఎలా చూడాలనుకుంటున్నారో మారుతి ప్రభాస్ ను అలా చూపించారు. వింటేజ్ ప్రభాస్ కనిపించాడు. హారర్ కంటెంట్ తో పాటు మారుతి మార్క్ కామెడీ కూడా రాజా సాబ్ లో అదిరిపోతుందని టీజర్ చూస్తే అర్థమవుతుంది. ప్రభాస్ మొదటి సారి హారర్ కంటెంట్ ఉన్న కథతో సినిమా చేస్తున్నాడు. ప్రభాస్ టైమింగ్, విజువల్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. టీజరే ఈ రేంజ్ లో ఉందంటే ట్రైలర్ ఎలా ఉంటుందో.. అలాగే సినిమా ఎలా ఉంటుందో అంటున్నారు ఫ్యాన్స్.




# ప్రధాని మోదీకి అరుదైన గౌరవం



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ప్రధాని సైప్రస్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మోదీకి అరుదైన గౌరవం లభించింది. ఆ దేశ అత్యున్నత పురస్కారంతో మోదీని అకడి ప్రభుత్వం సత్కరించింది. సైప్రస్ అత్యున్నత పురస్కారం 'ది గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారియోస్'ని ప్రధాని అందుకున్నారు. ఈ అవార్డుతో తనను సత్కరించినందుకు సైప్రస్ ప్రభుత్వానికి ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని ఈ సందర్భంగా ప్రకటించారు. ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలైడ్స్ ఆహ్వానం మేరకు ప్రధాని సైప్రస్ వెళ్లారు. జూన్ 15, 16 తేదీల్లో ప్రధాని అక్కడ పర్యటించనున్నారు. కాగా గడిచిన రెండు దశాబ్దాల్లో భారత ప్రధాని సైప్రస్ దేశంలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ పర్యటనలో ప్రధాని మోదీ.. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలైడ్స్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. సైప్రస్ పర్యటన అనంతరం ప్రధాని కెనడాలో జరుగుతున్న జీ7 సదస్సుకు హాజరుకానున్నారు. అనంతరం క్రొయేషియాలో కూడా పర్యటించనున్నారు.



# తెలంగాణ ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

తెలంగాణ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదల అయ్యాయి. ఫలితాలను బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులు ఈ మేరకు విడుదల చేశారు. ఈ ఫలితాల్లో 67.4 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఇంటర్ మొదటి, రెండవ ఏడాది జనరల్, వృత్తి విద్యా కోర్సులకు చెందిన విద్యార్థులందరి ఫలితాలు విడుదల అయ్యాయి. విద్యార్థులు తమ ఫలితాలు, మార్కులు https://tgbie.cgg.gov.in, http://results.cgg.gov.in ఈ వెబ్‌సైట్‌లలో చెక్ చేసుకోవచ్చు. మే 22 తేదీ నుంచి 29 వరకు ఈ

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# గ్లామరస్ లుక్‌లో రాశి ఖన్నా

ఈ నటి ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన వెంటనే వైరల్ కావడం ప్రారంభించాయి. దక్షిణ సినీ నటి రాశి ఖన్నా తన బోల్డ్ చిత్రాలతో అభిమానుల హృదయాలను శాసిస్తూనే ఉంది.నటి రాశి ఖన్నా ఇటీవల తన కొన్ని చిత్రాలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ చిత్రాలలో, నటి తన అందమైన రూపాన్ని హై స్లిట్ బ్లాక్ గౌనులో ప్రదర్శిస్తూ కనిపిస్తుంది.నటి రాశి ఖన్నా ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో వైరల్ కావడం ప్రారంభించాయి. ఈ చిత్రాలలో నటి అభిమానులను వెర్రివాళ్లను చేస్తోంది.నటి రాశి ఖన్నా చిత్రాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అభిమానులు ఈ చిత్రాలను లైక్ చేస్తున్నారు మరియు కామెంట్ చేస్తున్నారు.రాశి కొత్త ఫోటోలో, ఆమె గ్లామరస్ లుక్ కనిపిస్తుంది. రాశి 'మద్రాస్ కేఫ్' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది.



# డైరెక్ట్‌గా ఓటీటీలోకి ఉప్పు కప్పురంబు

మహానటి సినిమాతో దేశ వ్యాప్తంగా క్రేజ్ తెచ్చుకున్న కీర్తి సురేష్ ఇప్పుడు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ చిత్రాలలో నటిస్తూ అలరిస్తుంది. తాజాగా ఎల్లనార్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై రాధిక లావు నిర్మించిన ఉప్ప కప్పరంబు చిత్రంలో కీర్తి సురేష్ నటిస్తుండగా, ఈ చిత్రానికి అని. ఐ.వి. శశి దర్శకత్వం వహించారు. ఇందులో కీర్తి సురేష్ తో పాటు సుహాస్, బాబు మోహన్, శత్రు మరియు తళ్లూరి రామేశ్వరి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ మూవీ జూలై 4 నుండి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కాబోతోంది.కీర్తి సురేష్, సుహాస్, బాబు మోహన్, శత్రు, మరియు తాళ్లూరి రామేశ్వరి వంటి అద్భుతమైన తారాగణం నటించిన ఈ చిత్రాన్ని తెలుగులో తమిళం, హిందీ, మలయాళం మరియు కన్నడ భాషలలో డబ్‌లతో ప్రసారం చేయనున్నారు. చమత్కారం, హాస్యం తో నిండిన ఉప్ప కప్పరంబు ఒక సామాజిక సమస్యపై తేలికపాటి దృక్పథాన్ని ప్రదర్శిస్తుంది.1990 నాటి కథాంశంతో 'ఉప్పకప్పరంబు' సినిమా రూపుదిద్దుకుంది. దక్షిణ భారతదేశంలోని లోతట్టు ప్రాంత మైన చిట్టి జయపురం అనే కల్పిత గ్రామంలో ఈ కథ సాగుతుంది. తెలుగులో రూపుదిద్దుకున్న ఈ సినిమాను తమిళం, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లోనూ డబ్ చేసి ప్రైమ్ వీడియలో స్ట్రీమింగ్ చేయబోతున్నారు.




## ఫార్ములా ఈ రేస్ కేసు..
# ఏసీబీ ఎదుటకు కేటీఆర్


ఫార్ములా ఈ కార్ రేస్ కేసుకు సంబంధించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఈరోజు ఉదయం (సోమవారం) బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి కేటీఆర్ చేరుకోగా.. అధికారులు విచారణను ప్రారంభించారు. ఫార్ములా- ఈ రేస్ కేసులో కేటీఆర్ ఏ1గా ఉన్నారు. నిధుల దుర్వినియోగం, విదేశీ కంపెనీకి నగదు బదిలీకి సంబంధించి ఆయనపై ఏసీబీ అధికారులు ప్రశ్నలు సంధించనున్నారు. ముగ్గురు అధికారుల బృందం కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నారు. ఎఫ్‌ఈవో కంపనీకి నగదు బదిలీ చేసిన వ్యవహారంలో ఆ కంపనీని ఏసీబీ ఆన్‌లైన్‌లో విచారణ చేసి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. ఈ క్రమంలో ఎఫ్‌ఈవో కంపెనీ ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు కేటీఆర్ విచారణ నేపథ్యంలో ఏసీబీ ఆఫీస్ దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. ఏసీబీ కార్యాలయం దగ్గరకు ఎవరినీ అనుమతించని పరిస్థితి. ఈ క్రమంలో కేటీఆర్‌తో పాటు వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలను నీలోఫర్ ఆస్పత్రి దగ్గర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**వెనక్కి తగ్గేదే లేదు: కేటీఆర్**

ఏసీబీ విచారణకు వెళ్లే ముందు కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వస్తానన్నారు. విచారణలు, కమిషన్లు, వేధింపుల నుంచి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. నిజం



నిలకడ మీద తెలుస్తుందన్నారు. చట్టాలు, న్యాయస్థానాలపై గౌరవం ఉందని తెలిపారు. జైలుకు పోవాల్సి వచ్చినా భయపడేది లేదన్నారు. కాంగ్రెస్ హామీలు, డిక్లరేషన్లపై ఎండగడుతూనే ఉంటామన్నారు. లై డిటెక్టర్ సవాల్‌ను సీఎం రేవంత్ స్వీకరించాలన్నారు. తెలంగాణకు శ్రీరామరక్ష బీఆర్ఎస్సే అని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కాగా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్ములా ఈ కార్ రేస్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన విషయం తెలిసిందే. మొదటి సారి రేస్ విజయవంతంగా జరుగగా.. రెండో సారి మాత్రం రేస్ జరుగకముందే స్పాన్సర్ చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థ తప్పకుంది. రేస్ నిర్వహణ సంస్థకు హెచ్ఎండీఏ చెల్లింపులు జరిపింది. అయితే ఆర్బీఐ నిబంధనలు ఉల్లంఘించి విదేశీ కంపెనీకి నగదు బదిలీ అయిందని.. దాదాపు రూ.55 కోట్లు దుర్వినియోగం జరిగినట్లు ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముగ్గురిపై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. ఈ ఏడాది జనవరిలో కేటీఆర్‌తో పాటు ఆ ఇద్దరిని ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. మరోసారి విచారణకు రావాలని పిలువగా.. కేటీఆర్ సమయం కోరారు. దీంతో గత నెల 26న కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చింది ఏసీబీ. మే 28న విచారణకు రావాల్సిందిగా కోరింది. ఆ సమయంలో కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉన్నందున విదేశాల నుంచి తిరిగి వచ్చాక విచారణకు హాజరవుతానని ఏసీబీకి మాజీ మంత్రి సమాచారం ఇచ్చారు. అందుకు అంగీకారం తెలిపిన ఏసీబీ.. గత వారం మరోసారి నోటీసులు జారీ చేసి ఈరోజు (జూన్ 16) విచారణకు రావాల్సిందిగా పేర్కొంది. ఈ క్రమంలో నేడు ఏసీబీ ముందుకు రెండోసారి విచారణకు హాజరయ్యారు కేటీఆర్. ఇప్పటికే ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈసీఐఆర్ నమోదు చేసి.. జనవరిలో కేటీఆర్‌ను విచారణ చేసింది.



# బాసరలో విషాదం..

బాసర పుణ్యక్షేత్రంలో విషాదం నెలకొంది. అమ్మవారిని దర్శించుకునేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానం చేసేందుకు వెళ్లి మునిగిపోయారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గజఈతగాళ్లతో గోదావరిలో గాలింపు చేపట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఐదుగురు మరణించారు. మరణించినవారంతా హైదరాబాద్ లోని దిల్ సుఖ్ నగర్ వాసులుగా గుర్తించారు. అందరూ ఒకే కుటుంబానికి చెందివారని పోలీసులు తెలిపారు. నిర్మల్ జిల్లాలోని బాసరలో ఆదివారం తీరని విషాదం నెలకొంది. హైదరాబాద్ నుంచి సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు స్నానం చేసేందుకు గోదావరి నదిలోకి దిగారు. అయితే నీటి లోతు తెలియకపోవడంతో వారు మునిగిపోయారు. అక్కడున్నవాళ్ల సమాచారంతో గజఈతగాళ్లతో పోలీసులు గోదావరిలో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. నదిలో నుంచి ఐదుగురు డెడ్ బాడీలను బయటకు తీశారు. మరణించినవారంతా ఒకే కుటుంబానికి చెందినవారిగా గుర్తించారు. దిల్ సుఖ్ నగర్ నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన ఐదుగురు యువకులు ఈ విధంగా మరణించడం స్థానికులను కూడా కలచి వేసింది. డెడ్ బాడీలను సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.అనంతరం బంధువులకు డెడ్ బాడీలను అప్పగించారు.

# 'మమ్మల్ని తీసుకెళ్లండి'.. ఇరాన్‌లో భయం గుప్పిట్లో భారత విద్యార్థులు

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. పేలుడు శబ్దాలు, సైరన్ల మోతతో ఇరాన్ నిరంతరం అట్టుడుకుతోంది. దాంతో అక్కడున్న భారత విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తాము నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీలైనంత త్వరగా తమను తీసుకెళ్లాలని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 'శుక్రవారం తెల్లవారుజామున భారీ పేలుడు శబ్దాలతో నేను నిద్రలోంచి ఉలిక్కిపడి లేచా. నాతోపాటు చాలామంది బేస్‌మెంట్‌కు పరుగులు తీశాం. అప్పటి నుంచి మాకు నిద్రలేని రాత్రులే మిగిలాయి. ప్రతి రాత్రి పేలుడు శబ్దాలు వినిపిస్తూనే ఉన్నాయి. మేం ఉంటున్న ప్రాంతానికి కేవలం 5 కిలోమీటర్ల దూరంలోనే పేలుడు సంభవించినట్లు తెలిసింది' అని భారత్‌కు చెందిన మెడిసిన్ విద్యార్థి ఇంతిసాల్ మొహిదీన్ చెప్పాడు. 22 ఏళ్ల ఇంతిసాల్ టెహ్రాన్‌లోని షాహిద్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. ఆ యూనివర్సిటీలో అతడితోపాటు దాదాపు 350 మంది భారత విద్యార్థులున్నారు. అదేవిధంగా 'ఇక్కడ పరిస్థితి ఏం బాలేదు. రోజూ కాల్పుల శబ్దాలు వినిపిస్తున్నాయి. తాగునీటిని కూడా భద్రపర్చుకోవాలని అధికారులు చెబుతున్నారు. వైద్యులుగా మారేందుకు ఇక్కడికి వచ్చాం. కానీ ఇప్పుడు ప్రాణాలు దక్కించుకునేందుకు ప్రయత్నించాల్సి వస్తోంది. మమ్మల్ని కాపాడండి ప్లీజ్' అని మరో విద్యార్థి ఫైజాన్ నబీ ఆవేదన వెలిబుచ్చాడు.





# చరిత్రలో తెలంగాణ తొలి మహిళా బస్సు డ్రైవర్

తెలంగాణ రాష్ట్ర రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఆర్టీసీ) చరిత్రలో ఓ కీలక మలుపు వచ్చింది. సంస్థలో తొలి మహిళా బస్సు డ్రైవర్‌గా సరిత విధుల్లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మంత్రి కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు జీవితాంతం రుణపడి ఉంటానని మీడియా ద్వారా వెల్లడించారు. సరిత మాట్లాడుతూ - "మహిళా సాధికారత దిశగా ఆర్టీసీ ముందడుగు వేసింది. నేను యాదాద్రి భువనగిరి జిల్లాలోని సంస్థాన్ నారాయణపురం మండలం సిత్య తండాకు చెందినవాన్ని. ఇప్పుడు మిర్యాలగూడ డిపోలో జె.బి.ఎం. సంస్థ ఆధ్వర్యంలోని ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్‌గా విధుల్లో చేరాను" అని తెలిపారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్ నుండి మిర్యాలగూడకు నడిచే బస్సును నిర్వహిస్తున్నారు. ఈ విజయం వెనుక ఉన్న ప్రస్థానాన్ని కూడా సరిత పంచుకున్నారు. ఢిల్లీలో 10 సంవత్సరాలు బస్సు డ్రైవర్‌గా పనిచేసిన అనుభవం ఆమె సొంతం. ఆటో నడిపే రోజుల్లో ఓ మహిళా అధికారిణి పరిచయం కావడం వల్ల ఢిల్లీ రవాణా శాఖలో అవకాశం దక్కిందని చెప్పారు. "అప్పుడు 15 మంది మహిళల్లో నేను ఒక్కతేనే ఎంపికయ్యాను. అక్కడ 10 ఏళ్ల పాటు పనిచేశాను. కానీ నా కుటుంబం - ముసలి తల్లిదండ్రులు, అక్కలు, చిన్నదాన్ని దగ్గరుండి చూసుకోవాలని కొన్నిసార్లు విన్నవించుకున్నా - పూర్వ ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోలేదు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడా కల నెరవేరిందని, తెలంగాణలో తొలి మహిళా డ్రైవర్‌గా విధుల్లో చేరడం గర్వంగా ఉందని చెప్పారు. సరిత విజయగాథ ఇప్పుడు ఎన్నో యువతులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.